క్లుప్తంగా

తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా పందిరి సైదులు



నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్ర కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన పందిరి సైదులును నియమిస్తూ ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రమాబాయి జయంతి

మర్రిగూడ: రమాబాయిఅంబేద్కర్ జయంతిని గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి యాస అమరేందర్‌రెడ్డి, ఛత్రవాస్ సంపర్క్ అభియాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గ్యార గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములమ్మకు నివాళి

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ నానమ్మ బడుగుల శ్రీరాములమ్మ సంతాప సభను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాములమ్మ చిత్రపటం వద్ద ఎంపీటీసీ బడుగుల రవీందర్, మాజీ సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బడుగుల కవితనరేందర్, బీఆర్ఎస మండల ప్రధాన కార్యదర్శి చిమట వెంకన్న, వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు.

11న ఘంటసాల గానామృత సభ



కరపత్రం ఆవిష్కరిస్తున్న దాసోజు శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ): ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11న స్థానిక లయన్స్ క్లబ్‌లో విశ్వం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గానామృత సభ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎన్జీ కళాశాలలో సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సాహిత్య అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, రఘువీర్ ప్రతాప్, పెరుమాళ్ళ ఆనంద్, వెంకటేశ్వర్లు, లక్ష్మణాచార్యులు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, దాసోజు జ్ఞానేశ్వరాచారి, దాసోజు రవికుమార్, శ్రీనివాస్, ఈసం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, జీఎమ్మార్ ప్రతినిధులు

కేతేపల్లి: రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతేపల్లిలో జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై, వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రత నిబంధనలపై ముద్రించిన కరత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఓఎం మేనేజర్ రమేష్, టోల్ మేనేజర్ శివకుమార్, జీఎమ్మార్ ప్రతినిధులు, నాగకృష్ణ, సతీష్, రవితేజ, సాయినాథ్, నాగయ్య, ఫౌండేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ నరేష్ పాల్గొన్నారు.

మేకల అపహరణ

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ గ్రామంలో బుధవారం రాత్రి రెండు మేకలు అపహరణకు గురయ్యాయి. స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె ఆంజనేయులు మేకలను పెంచుతున్నాడు. బుధవారం రాత్రి ఇంటి వద్ద పాకలో మేకలను కట్టేశాడు. గురువారం ఉదయం నిద్రలేచి చూసేసరికి మేకలు కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మేకలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఆంజనేయులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లగొండక్రైం: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. నల్లగొండ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 31న రాత్రి సమయంలో సాగర్ రోడ్డులోని రుద్రమదేవి కాలనీ శివారులో అతి వేగంగా వస్తున్న ఆటో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి (55)ని ఢీకొట్టింది. అతడికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా.. మృతుడు భిక్షాటన చేసేవాడని, తన పేరు రాజు అని, గ్రామం కొల్లాపూర్, గద్వాల అని చెప్పేవాడని పోలీసులు తెలిపారు. చేతిపై హిందీలో పచ్చబొట్టు ఉందని వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

పెన్షన్‌దారుల తిప్పలు తీరేదెప్పుడు!

- పింఛన్ తీసుకునేందుకు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్న లబ్ధిదారులు
- తమ గ్రామంలోనే ఇవ్వాలని జక్కలవారిగూడెం వాసుల వేడుకోలు



ఆసరా పెన్షన్ తీసుకునేందుకు కాలినడకన మునుగోడు వెళ్తున్న వృద్ధులు, వితంతువులు

మునుగోడు: ప్రతి నెలా ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అందిస్తున్న ఆసరా పెన్షన్లు తీసుకునేందుకు మునుగోడు మండలంలోని జక్కలవారిగూడెం గ్రామ లబ్ధిదారులు తిప్పలు పడాల్సి వస్తోంది. జక్కలవారిగూడెం నాలుగేళ్ల క్రితం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైనప్పటికీ గతంలోలాగానే లబ్ధిదారులు మునుగోడుకు వెళ్లి పెన్షన్ తీసుకోవాల్సి వస్తోంది. గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో మునుగోడు వెళ్లేందుకు వృద్ధులు పడరాని పాట్లు పడుతున్నారు. తమ గ్రామంలోని పెన్షన్‌దారులకు స్థానికంగానే పెన్షన్ ఇవ్వాలని అధికారులకు ఆ గ్రామ సర్పంచ్ అనేకమార్లు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది.

కాలినడకన మూడు కిలోమీటర్లు..

నాలుగేళ్ల క్రితం వరకు మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోనే జక్కలవారిగూడెం ఉండేది. గత ప్రభుత్వం జక్కలవారిగూడెంను నూతన గ్రామ పంచాయతీ చేసింది. కానీ ఆ గ్రామంలో నేటికీ గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించలేదు. ఆ గ్రామంలోని పెన్షన్‌దారులకు గ్రామంలో పెన్షన్ డబ్బులు ఇవ్వకపోవడంతో గతంలో లాగానే లబ్ధిదారులు మునుగోడుకు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి పెన్షన్ తెచ్చుకుంటున్నారు. జక్కలవారిగూడెం గ్రామంలో మొత్తం 60 మంది పెన్షన్‌దారులు ఉండగా అందులో వృద్ధులు 45 మంది, దివ్యాంగులు ఆరుగురు, 9 మంది వితంతువులు ఉన్నారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు మునుగోడుకు వెళ్లి పెన్షన్ తీసుకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. కొందరు తమ కుమారుల సహాయంతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మరికొందరు ప్రత్యేకంగా ఆటో కిరాయికి తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఆటోలో వెళ్లినప్పుడు ఆటో కిరాయి వచ్చిపోయేందుకు రూ.200లకు పైగా ఖర్చవుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంతమంది వృద్ధులు ఆటో కిరాయి డబ్బులు ఇచ్చే స్తోమత లేక కాలినడకన వెళ్లి తెచ్చుకుంటున్నారు. దీంతో కొంతమంది మార్గమధ్యలో అస్వస్థతకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని జక్కలవారిగూడెం గ్రామంలో ప్రతినెలా పెన్షన్ డబ్బులు ఇచ్చేలా చొరవ చూపాలని గ్రామ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మా ఊరి పెన్షన్‌దారులకు పెన్షన్ డబ్బులు మా గ్రామంలోనే ఇవ్వాలని అనేకమార్లు అధికారులకు వినతులు అందించా. కానీ పట్టించుకోవడం లేదు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. పేరుకే మా ఊరిని గ్రామ పంచాయతీ చేశారు. మా గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో వృద్ధులు మూడు కిలోమీటర్లు ఉన్న మునుగోడుకు వెళ్లి పెన్షన్ డబ్బులు తెచ్చుకోవాల్సి వస్తోంది.

– జక్కలి శ్రీను, మాజీ సర్పంచ్, జక్కలవారిగూడెం

మా గ్రామంలో ఇస్తే బాగుండు



నాకు ప్రతి నెలా పెన్షన్ డబ్బులు మునుగోడులోనే ఇస్తున్నారు. మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. అవే డబ్బులు మా గ్రామంలో ఇస్తే బాగుండేది. చేతకానప్పుడు ఆటోలో వెళ్తే రానుపోను కిరాయి రూ.200 అవుతోంది. మాపై దయతలిచి పెన్షన్ డబ్బులు మా గ్రామానికి వచ్చి ఇస్తే సంతోషపడతాం.

– జక్కలి మల్లయ్య, పెన్షన్‌దారుడు, జక్కలవారిగూడెం

ఎంపీ టికెట్‌కు దరఖాస్తు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న వల్లె నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ తిప్పర్తి మండలం మర్రిగూడెంకు చెందిన ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి వల్లె నారాయణరెడ్డి గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ 47 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు.

ఉర్సు వద్ద అన్నదానం

మర్రిగూడ: మండలంలోని కొండూరు గ్రామంలో జరుగుతున్న ఉర్సు వద్ద కొడాల బ్రదర్స్ కొడాల వెంకట్‌రెడ్డి, కొడాల అల్వాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉర్సు వద్ద తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంభం నర్సమ్మమాధవరెడి పాల్గొన్నారు.

కేసీఆర్ సభను జయప్రదం చేయాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్ : పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చెరుకు సుధాకర్, బాలరాజు

నకిరేకల్ : ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి మండలాల బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కృష్ణా జలాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాలన్నారు. ఈ నెల 13న జిల్లా కేంద్రంలో చలో నల్లగొండ పేరుతో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. అనంతరం చలో నల్లగొండ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, గుత్తా అమిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, ఏడుకొండలు, మారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న బీఆర్ఎస్ సభకు భారీగా జనసమీకరణ

నార్కట్‌పల్లి : నల్లగొండలో ఈ నెల 13వ తేదీన జరగనున్న బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీ జన సమీకరణ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి పార్టీ కార్యకర్తలను భారీగా తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బలరాం జ్యోతి, యానాల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కట్టంగూర్ పీహెచ్‌సీ పనులు

- రూ.1.56 కోట్ల వ్యయంతో పీహెచ్‌సీ నూతన భవనం
- త్వరలో అందుబాటులోకి వైద్య సేవలు



కట్టంగూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం

కట్టంగూర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఫిబ్రవరి 2023లో కట్టంగూర్ పీహెచ్‌సీకి నూతన భవనం మంజూరు చేసింది. కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు పడకల నూతన భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.56 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు సంవత్సరం కాలంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే భవనానికి రంగులు వేయడం పూర్తి కాగా లోపలి భాగంలో మార్బుల్స్, టైల్స్ వేస్తున్నారు. రెండు వైద్యాధికారి గదులు, రెండు స్టాఫ్ నర్స్ గదులు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, రోగులకు వెయిటింగ్ హాల్, జనరల్ వార్డు గదుల నిర్మాణం పూర్తయింది. మరో పక్షం రోజుల్లో నూతన భవనం చుట్టూ, ఆస్పత్రి గేటు నుంచి భవనం వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. పనులు పూర్తయితే మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

శిథిలావస్థలో పాత భవనం

గతంలో నిర్మించిన భవనం ఇరుకుగా ఉండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పాత పీహెచ్‌సీ భవనం స్లాబ్ పై భాగం వంపుగా ఉండి వర్షాలు వచ్చినప్పుడు కురుస్తుండడంతో ఆస్పత్రి వచ్చే రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురయ్యేవారు. పాత భవనంలో వసతులు లేకపోవడంతో మండల ప్రజల కోరిక మేరకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. నూతన భవనం ప్రారంభమయ్యాక రోగులకు 24 గంటల వైద్య సేవలు అందించాలని, వైద్యుల సంఖ్య పెంచాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

24 గంటలు వైద్యం అందించాలి



కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్త భవన నిర్మాణంతో మండల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. నూతన భవనం విశాలంగా ఉండడంతో సౌకర్యంగా ఉంటుంది. నూతన భవనం ప్రారంభం అనంతరం 24 గంటల వైద్యం అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

– పి. అంజయ్య, కట్టంగూర్

ఎక్కువ మంది రోగులు వచ్చినా ఇబ్బంది ఉండదు



నూతన భవనం అన్ని మౌలిక వసతులతో రోగులకు, వైద్య సిబ్బందికి సౌకర్యంగా ఉంటుంది. విశాలమైన గదుల్లో మేల్, ఫిమేల్ రోగులకు వేరుగా వైద్యం అందిస్తాం. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ పెద్దగా నిర్మించడంతో పేషెంట్స్ ఎక్కువ సంఖ్యలో వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. త్వరలోనే పీహెచ్‌సీ భవనం ప్రారంభమవుతుంది.

– శ్వేత, వైద్యాధికారి, కట్టంగూర్

కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణి మానుకోవాలని సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ కేరళ ప్రభుత్వాన్ని కేంద్రం అణిచివేతకు గురిచేస్తోందని, ఆ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన పాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నర్సింహ, సలివోజు సైదాచారి, అవురేష్ మారయ్య, నాగరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో సెమినార్

నల్లగొండ: ఈ నెల 16,17 తేదీల్లో పట్టణంలోని చర్లపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో నేషనల్ సెమినార్ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ అనే శీర్షిక పై సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దీవంత, ఉపాధ్యాయులు అక్బర్, మాస బాలరాజు, వేణు, శ్రీను, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో గణపతి పూజ



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజుల పూజల్లో భాగంగా గురువారం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకు జలాదివాసం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులందరూ పంచామృతాలు తీసుకొచ్చి ప్రతిష్టించే విగ్రహానికి అభిషేకాలు నిర్వహించినట్లయితే స్వామివారి ఆశీస్సులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవులపల్లి నాగరాజుశర్మ, మద్దులూరి శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి



కట్టంగూర్ : కురుమర్తిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



చిట్యాల : ప్రచార కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు



మునుగోడు: ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

చండూరు: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ప్లానింగ్ కమిటీ సభ్యుడు పిన్నింటి నరేందర్ రెడ్డి అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా గురువారం చండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నయా పైసా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు అందుతున్న నిధులు మొత్తం కేంద్రానివే అన్నారు. ఆయా కార్యక్రమాల్లో బూత్ కమిటీ సభ్యుడు బరిగెల లింగస్వామి, రామలింగం, నరికొండ సైదులు, దోటి శ్రీనివాస్, గిరి రాజు, కిరణ్ కుమార్, హరీష్, గౌతమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశాభివృద్ధి సాధ్యం

కట్టంగూర్ : బీజేపీతో దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పసుల సైదులు అన్నారు. గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు గురువారం మండలంలోని కురుమర్తి గ్రామంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మారం శేఖర్‌రెడ్డి, గద్దపాటి సుదర్శన్, వెంకన్న, శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

గావ్ చలో.. బస్తీ చలో

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని 98, 99, 100వ పోలింగ్ బూత్‌లలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కన్నెబోయిన మహాలింగం, నకిరేకల్ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గుండాల నరేష్‌గౌడ్, బూత్ కన్వీనర్లు అమరోజు గోవర్ధన్, పురం ప్రశాంత్, సతీష్, సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల శ్రమదానం

మునుగోడు: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేందుకు గురువారం మునుగోడులోని దళిత కాలనీలో బీజేపీ నాయకులు శ్రమదానం చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రవాసి కార్యకర్త అక్కెనపల్లి సతీష్, మాదగోని నరేందర్ గౌడ్, ఏర్పుల క్రాంతికుమార్, పోలె వెంకటేశ్వర్లు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



చండూరు: కార్మికులకు కరపత్రాలను అందజేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. గురువారం భారత్ బంద్ పోస్టర్‌ను స్థానికంగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో భీమగాని గణేశ్, సాగర్ల యాదయ్య, దొమ్మాటి సైదులు, సూరజ్, సంతోష్, ద్వారక్, అరవింద్, దయానంద్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

చండూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండా శ్రీశైలం కోరారు. గురువారం సమ్మె కరపత్రాలను ఘట్టుప్పల్ మండలంలోని పలువురు కార్మికులకు ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పన్నులను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య, బొట్టు శివకుమార్, కుక్కునూరి నగేష్, అచ్చిని శ్రీనివాస్, కర్నాటి వెంకటేష్, బొల్లేపల్లి పుల్లయ్య, బండారి కృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతో వైస్ ఎంపీపీకి సంబంధం లేదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య

నల్లగొండ రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ జి. పరమేశ్‌కు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్ అన్నారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరి.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి కాగానే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎంపీటీసీ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. గతంలోనే కొత్తపల్లి ఎంపీటీసీని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో కోమటిరెడ్డికి వ్యతిరేకంగా పనిచేసి కాంగ్రెస్ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ వజ్జె సత్యనారాయణయాదవ్, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పాలడుగు అజయ్, పగిడి విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ చెత్త సేకరణ రిక్షాలు





కేతేపల్లి పీహెచ్‌సీ ఆవరణలో వృథాగా పడివున్న చెత్త సేకరణ రిక్షాలు

కేతేపల్లి: గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీలకు పంపించిన స్వచ్ఛభారత్ రిక్షాలు చెత్త కుప్పల్లోకి చేరాయి. సుమారు తొమ్మిదేళ్ల కిందట గత ప్రభుత్వం ఒక్కో రిక్షాకు రూ.10వేలు వెచ్చించి కొనుగోలు చేసి పంచాయతీలకు అప్పగించింది. గ్రామ జనాభా ఆధారంగా ఒక్కో గ్రామానికి మూడు నుంచి ఎనిమిది వరకు రిక్షాలు అందజేశారు. పంచాయతీల్లో చెత్త, చెదారాన్ని సేకరించేందుకు కొంతకాలం బాగానే పని చేశాయి. పంచాయతీలకు ట్రాక్టర్లు అందుబాటులోకి రావడంతో చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో రూ.వేలు వెచ్చించి చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన రిక్షాలు మూలనపడ్డాయి. వాటిని ఉపయోగించకుండా వదిలేయడంతో తుప్పు పట్టాయి. పంచాయతీ కార్యాలయాల ఆవరణలో, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛభారత్ రిక్షాలను పడేశారు. పలు గ్రామాల్లో రిక్షాల విడిభాగాలను దొంగలు ఎత్తుకెళ్లి పాత ఇనుము దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.